హంగరీమూలం: గేజాగ్రాడోదీ

# చిత్రకారుడిగా అద్భుతాలు చేసిన అతను ఓ వెర్రితల్లి అడిగిన చిత్రాన్ని గీయగలిగాడా?

# ప్రతిబింబం

## పురాణపండ రంగనాథ్ కథ

అవాళ నేను యింటిలోంచి బయటకు వచ్చి, రెండు సందులు వడిచేసరికి గ్రామంలోని పిల్లలందరూ వూరి చివరి తోపు వైపు పరుగెదుతున్నారు. చేతికి దొరికిన ఒక పిల్లవాణ్ణి "సంగతేమిటని" అడిగాను.

"ఎవరో ఒకాయన వచ్చాట్ట. అక్కడ ఆయన బొమ్మలు వేస్తున్నాడట"— ఆ పిల్లవాడు నా పట్టు మంచి తప్పించుకొనేటందుకై గింజుకున్నాడు. వాణ్ణి వదిలి ముఖంవైపు చూశాను. వాడి ముఖం పెనుగులాటలో కందిపోయింది. సన్నగా నవ్వుకొన్నాను. బాల్యం అంతా వేగవంతమైంది. ఇప్పుడీ వయసులో నాకంత శక్తి ఎక్కడుంది? ఆయాసం తప్ప.

బొమ్మలు వేస్తున్నాడంటే చిత్రకారుడై ఉంటాడు. వెళ్లి చూద్దాం అనుకొన్నాను. చూశాను.

మా గ్రామం శివారున రకరకాల చెట్ల తోపు ఉంది. రంగురంగుల పిట్టలు ఆ చెట్లమీంచి మాట్లాడుతుంటాయి. చిత్రకారులకు అంతకన్న అందమైన ప్రకృతి, ఏకాంతం ఎక్కడ దొరుకుతాయి. అందుకే ఆ చిత్రకారుడు ఆ తోపులో ఒక చెట్టు క్రింద పచ్చికపై కూర్చుని ఉన్నాడు. అతని యెదురుగా చిన్న 'టీపాయ్' ఉంది. ప్రక్కగా 'స్టాండ్'కి 'కాన్వాస్' బిగించి ఉంది. దగ్గరగానే రంగుల పేలెట్ ఉంది. కొందరు పిల్లలు చెట్ల కొమ్మలు ఎక్కేసి అతడు చిత్రం వేసే తీరు బాగా చూడవచ్చునను కొని ఆబగా చూస్తున్నారు.

చిత్రకారుడు యువకుడు, నాజూకు జుట్టు వాడు. వేసవి ఎండలకు వడిలిన



ముఖం. తిప్పట వలన అలసిన శరీరం. తలపై టోపీ. మెడపై ముఖ్ మల్ గుడ్డ. ఆకర్షణీయమైన చూపులు. ముమ్మూర్తులా హంగరీ యువకుడి లక్షణాలు అతనిలో రూపుకట్టి ఉన్నాయి.

"మేస్టారు వస్తున్నారు"— అనే మాట విని అంత వరకు విశ్చలంగా కూర్చున్న అతను లేచి నిలబడ్డాడు. చేతిలో కుంచెను

ప్రక్కనపెట్టి వినయాన్ని ప్రదర్శించాడు.

"నా పేరు ఇస్త్రావన్ రోజ్. మ్యూనిక్ నుంచి వచ్చాను. ఈ శిశిరం వెళ్లే వరకు కూడ ఉండి చిత్రాలు వేస్తాను" అన్నాడతను.

"ఈ గ్రామంలోకి ఎలా వచ్చావయ్యా?–"

"దేవుడికి తెలియాలి. ఎక్కడికి వెళ్లాలనిపిస్తే అక్కడకు వెళతాను. ప్రాక్టీస్ చేస్తుంటాను. ఒక వారం వుండి వెళ్లిపోతాను"– అన్నాడు తాను.

"సరే! నీ యిష్టం. ఇక్కడ నీకే యిబ్బందీ ఉండదు. పనిచేసుకో".

ఆ యువకుడు అక్కడి ప్రకృతిలో నుంచి ఒక ఆకుపచ్చటి సుందరదృశ్యాన్ని చిత్రిస్తున్నాడు. వంతెన కాలువ ఒడ్డు. నీటి తరగలు. నీటిలో చెట్ల నీడలు, సర్ వృక్షాలు. అతడు మరల కుంచెను తీసుకొన్నాడు. మాటిమాటికీ ఆ ప్రకృతి దృశ్యాన్ని చూస్తూ చిత్రంపై రంగులు అద్దసాగాడు. ఏమనుకున్నాడో ఒక్క క్షణం చిత్రీకరణ ఆపి ఇలా అన్నాడు.

"నాలాంటి వాడు యిక్కడకు యింతకు ముందు వచ్చి ఉండడు. కాని ఎవరి బొమ్మ వేద్దామనుకున్నా ఎవరికి వారు ముఖం చాటుచేస్తున్నారు. మోడల్‌గా ఉండమంటే ముడుచుకొని పోతున్నారు".

"మోడల్ అంటే వాళ్లకు ఏం తెలుస్తుంది. వాళ్ల భాషలో వాళ్లకు చెప్పాలి".

"అదే చేశాను. ఓ రాగిరంగు ముఖం కుర్రాడిని ఒప్పించి కూర్చోబెట్టాను. కాని యింతలోనే నా చేతి కుంచెను చూసి అదేదో మంత్రదండం అనుకుని వాడిని భయపెట్టి లాక్కుపోయారు.

"సరే! నువ్వే చెప్పు. ఎవరి బొమ్మ వేయాలనుకొంటున్నావో నేను ప్రయత్నిస్తాను".

అతను చేతిలో కుంచెను అక్కడ పెట్టి ఇలా అన్నాడు:

"నేనో ముసలిని చూశాను. ఆ బొమ్మ వేస్తే అద్భుతంగా వుంటుంది. పేరు కేవేశి.... కాపేశి... అలాంటిదేదో.. సరిగా గుర్తు రావడం లేదు. బాగా వయసు పండిపోయింది. జుట్టంతా ముగ్గు బుట్టలా నెరిసిపోయింది. ముఖం కాల్చిన యినుములా ఎర్రగా ఉంటుంది. భలే తమాషా రంగు... సిందూర ప్రతిమవలె..."

"కైవీ?"

"కైవీ. ఆ– అదే పేరు. చర్చికి దగ్గర యింట్లో నివాసం. నీలం రంగు కలిపి కైవి ముక్కు రంగు వేయగలను"– అన్నాడు చిత్రకారుడు.

"తొందరేం లేదు. ఈ బొమ్మ పూర్తిచెయ్యి. ఆ ముసలాయన్ని నీ దగ్గర కూర్చోబెడతాను".

"ఆయన్ని ఒప్పిస్తే మీకు జీవితాంతం ఋణపడి ఉంటాను"– అని అతను యిక ఆ రోజుకి పెయింటింగ్ ఆపేసి, తన సామాను సర్దుకొన్నాడు.

ఇద్దరం కైవీ యింటికి వెళ్లాం.

శరత్కాలపు మలివెచ్చని ఎండలో తన యింటి ముందు చెక్క బెంచీలో ఆ ముసలాయన గత స్మృతులు నెమరువేసుకొంటున్నాడు. మేం రావడాన్ని చూసి లేవ

బోయాడు. నేను వారించాను. ముసలాయన 'ఉఫ్' అన్నట్లు నవ్వి మా యిద్దరికీ తన పల్చటి చేతితో కరచాలనం చేశాడు. ఆయన స్పర్శలో వేడి ఎక్కడ ఉంది? చల్లగా ఉంది. అది స్మృతి శీతలం అనిపించింది. నేనాయనకు చిత్రకారుణ్ణి పరిచయం చేశాను.

"బొమ్మలు బ్రహ్మాండంగా వేస్తాడు. ఫోటోల వంటివి కావు. రంగులతో చిత్రిస్తాడు. మీ బొమ్మ వేయాలనుకొంటున్నాడు. తైలవర్ణ చిత్రం"— అన్నాన్నేను.

"తైలం?"

"అవును. చర్చిల్లో దేవదూతల బొమ్మల్లాగా"

"నేనెక్కడా చూడలేదు"— అన్నాడాయన.

"మీ బొమ్మని యితను వేస్తాడు. అన్నీ తెలుస్తాయి"

"నేనేం సాధువుని కానే".

"ఇతను హంగరీ ప్రజల చిత్రాల్ని వేయాలని వచ్చాడు. మన సంప్రదాయాల్ని రూపురేఖల్ని చిత్రిస్తాడు. వందలమంది హంగేరియన్లలో మీరు ఉంటారు".

కైవీ మమ్మల్ని అవిశ్వాస దృష్టితో చూశాడు.

"నాదెందుకు? ముసలి వాణ్ణయిపోయాను. మా అబ్బాయిలున్నారు. వాళ్ల బొమ్మలు వేయుమను".

"వృద్ధాప్యానికి నిర్వచనంవలె ఉన్న మిమ్మల్ని చిత్రించడమే నా లక్ష్యం. ఎరుపు రంగు హోమర్‌వలె మిమ్మల్ని చిత్రిస్తాను. ఎంతో అందమైన కల్పన చేస్తాను. ఎరుపు రంగు నేత్రాంచలాల నుంచి రౌద్రరసాన్ని ప్రసరిస్తూ హోమర్ వీరగాథల్ని గానం చేస్తున్నట్లు మిమ్మల్ని చిత్రిస్తాను"— అన్నాడు చిత్రకారుడు.

"ఏమిటీ! నువ్వు నన్ను హోహెర్‌ని చేసేస్తావా, హోహెర్ అంటే ఏమిటో తెల్సా! జులాయి అని అర్థం" ముసలాయన కోపంగా అన్నాడు.

"అది కాదండి. హోమర్. హోమర్ గ్రీక్ మహాకవి".

## సిగరెట్ కాటరాక్ట్

పొగ తాగేవారికి అనేరకాలైన వ్యాధులు వస్తాయని అందరికీ తెలుసు! అయితే ఈ వ్యాధుల లిస్ట్‌లోకి మరొకదాన్ని కూడా చేర్చవచ్చునంటున్నారు బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ విలియమ్ క్రిస్టెన్. రోజుకు ఇరవై సిగరెట్లు తాగేవారిలో మామూలు వారికంటే రెండురెట్లు ఎక్కువగా 'కాటరాక్ట్' వ్యాధి వచ్చే అవకాశం ఉందని ఆ అమెరికన్ డాక్టరు అంటున్నాడు. మరి పొగ థ్రిల్ కావాలో... కంటిచూపు పదిలంగా ఉండాలో ధూమపాన ప్రియులు నిర్ణయించుకోవాలి!



—జూపిటర్

"గ్రీక్?"— కైవీ ముఖం మరీ ఎర్రబడింది.

"కోపగించకు. నీ బొమ్మనంత బాగా వేస్తాడీతను"—నేను సముదాయిస్తూ అన్నాను.

"నేను మీ ముఖాన్ని చక్కటి, నిండైన గెడ్డం వేస్తాను" చిత్రకారుడు అన్నాడు. ముసలాయన ఘెర్రుమన్నాడు.

"ఏవిటీ గెడ్డమా? అదేం కుదరదు. వేళాకోళం పనికిరాదు.. మీరు పెద్దవాళ్లు అయి ఉండవచ్చు" అన్నాడు కైవీ.

చిత్రకారుడు మౌనం వహించి ఉంటే బాగుండేది. కాని యువకుడు కదా. తొందరెక్కువ. ముసలవాళ్ల మనోభావాలు చంచలంగా ఉండవని తెలివివాడు. అందుకే నేను కల్పించుకున్నాను.

"నువ్వుండు. నేను మాట్లాడతాను"— అనడంతో అతను అక్కడ ఉన్న నూతి దగ్గరకు వెళ్లిపోయాడు. అక్కడే కాన్వాస్ బిగించుకొని గ్రామీణ నేపథ్యంలో యింటిని చిత్రించుకోసాగాడు.

అప్పటికి యింటిలోంచి ఒకరిద్దరు స్త్రీలు అక్కడకు వచ్చారు. నేను కైవీ భార్యను గుర్తుపట్టి పలకరించి యిలా అన్నాను:

"ఆ అబ్బాయి విదేశీయుడు. చిత్రకారుడు. మన గ్రామం గురించి కొన్ని బొమ్మలు వేశాడు. ఓ చిన్నారి బాలుడి బొమ్మ, ఓ అందాల అమ్మాయి బొమ్మా, ఓ ముసలాయన బొమ్మ వేయాలనుకొంటున్నాడు. మన గ్రామంలోని వృద్ధులలో కైవీ అతనికి నచ్చాడు. ఒక్క పావుగంట ఈయన ఆ అబ్బాయి దగ్గర కూర్చుంటే బ్రహ్మాండమైన బొమ్మ వేసుకొంటాడు. అయితే ఈయన ఒప్పుకోవడం లేదు. ఈ బొమ్మల్ని యితను దేశదేశాలలో ప్రదర్శిస్తాడు. అక్కడివారు హంగరీలో యింతటి తేజస్సులైన వయోవృద్ధులున్నారా? అని ప్రశంసిస్తే మనకెంత గౌరవం! ఎంతపేరు! కైవీ పేరు పత్రికలలో కూడా వేస్తారు".

నా మాటలకు ఆమె కొంచెం కరిగింది. భర్తవైపు తిరిగింది.

"ఎందుకు వేయించుకోవయ్యా?" అని అడిగింది భర్తని.

"యువకులు లేరనా? ముసలి గుర్రం ఏం పరుగెడుతుంది?" — కైవీ తన ధ్యానలోనే అంటున్నాడు.

ఏం మూర్ఖత్వమయ్యా బాబూ! ముసలివాళ్లు కావలసిన చోట యువకులెందుకట? సెయింట్ పీటర్ బొమ్మని పాతికేళ్ల యువకుడిగా చిత్రిస్తే ఏంబాగుంటుంది?" అందావిడ. ముసలాయనసణుక్కుంటున్నాడు.

"అలా చూడు, ఆ అబ్బాయి ఆ బొమ్మ ఎంత బాగా వేశాడో!" అంది ముసలామె.

చిత్రకారుడు పండుటాకుల రంగుల్ని ఒక చెట్టుకి అంకితం చేశాడు. ఆకులన్నీ పసుపు రంగులో ఉండి చెట్టుకి వృద్ధాప్యానికి సంకేతంగా చూపిస్తున్నాయి. ఆ బొమ్మ ముసలాయన్ని ఆకర్షించింది.

"సరే. ఈ ముసిలాడి బొమ్మే కావాలంటే వేసుకోమను"— అని లేచి నావైపు తిరిగి "బట్టలు మార్చుకొని వస్తాను— అబ్బాయిని పిలవండి" అని ఇంటిలోకి అడుగులు వేయబోయాడు. మా మాటల్ని స్పష్టాస్పష్టంగా వింటున్న చిత్రకారుడు— చకచక దగ్గరకు వచ్చి "తాతగారూ! బట్టలేం

మార్చుకోనక్కరలేదు.. నేను మీ తల భాగం మాత్రమే చిత్రిస్తాను''— అని ఆయన్ని ఆపాడు.

''తలా? కాళ్లూ, చేతులూ లేకుండా ఏం బాగుంటాడయ్యా?'' నేను చిత్రకారుడికి సంజ్ఞ చేశాను. అతడు అర్థం చేసుకొన్నాడు. మరి మాట్లాడలేదు.

''కైవీ! నువ్వు కిటికీలోంచి బయటకు చూస్తున్నట్లు బొమ్మ వేస్తాడు. అపుడు కాళ్లూ చేతులూ కనిపించవు కదా!'' అని నేను ముసలాయన్ని సమాధానపరిచాను. ముసలాయన మాత్రం లోపలకు వెళ్లి, తనకిష్టమైన బట్టలు కట్టుకొని వచ్చాడు.

తన దుస్తులు చిత్రింపబడినా, చిత్రించ బడకపోయినా అతడికి పట్టింపు లేదు. తన బొమ్మ వేయబడుతున్న ఈ మహత్తర క్షణంలో తమ ఆ దుస్తులలో ఉండడమే ఒక తృప్తి కైవీకి. ఎవ్వరూ చెప్పకుండావే కైవీ అక్కడ ఒక కుర్చీలో విశ్రాంతిగా కూర్చు న్నాడు. నిశ్చలంగా ఉండిపోయిన సజీవ చిత్తరువైనాడు.


ఆ సమయంలో అక్కడంతా తన్మయ ప్రశాంతి ఆవరించింది. చిత్రకారుడు కా న్వాసుపై కైవీ ముఖరేఖల్ని గీశాడు. ముక్కు వేశాడు, కళ్లు చిత్రించాడు, మీసాలు వేశాడు , నేపథ్యం అంతా పండిన బాదంరంగు పులిమాడు.

''చిత్రం తయారయింది''— శ్రీమతి కైవీ అంది. అంతలోనే ''ఇంకా రూపం పూర్తిగా రాలేదే?'' అని అడిగింది.

అంతలోనే చిత్రకారుడు ఆ బొమ్మ ముఖభాగంపై ఎరుపు రంగు, తలకు తెలుపు రంగు వేశాడు.

మరికొన్ని సెకనులలోనే బొమ్మ పూర్తి అయింది. శ్రీమతి కైవీ ఆ బొమ్మ చూసి పెదవి విరిచింది.

''ఇదేమిటబ్బాయ్! ఆయన వయస్సు ఇరవై యేళ్లు తగ్గించి వేశావ్?'' అందామె. కైవీ మాత్రం ఆనందించాడు. ఇరవైయేళ్ల నాటి తన రూపాన్ని చూసి, కళ్లు మూసు



కుని ఏవో తలుచుకొంటున్నాడు.

కైపీ బొమ్మ గురించి అక్కడ చేరినవాళ్లు చర్చించుకొంటుండగా అక్కడకు బోజోకి అనే ఆవిడ వచ్చింది. పరిస్థితి గమనించింది.

"బొమ్మ వేయడానికి ఎంత యిచ్చారు?–" అని శ్రీమతి కైపీని అడిగింది. ఆమె ఖస్సుమంది.

"ఆ అబ్బాయి ముచ్చటపడి, అడిగి, బలవంతపెట్టి ఈ బొమ్మ వేశాడు. మేమేం డబ్బిచ్చి వేయించుకోలేదు" అంది శ్రీమతి కైపీ నిష్ఠూరంగా.

అప్పటికి చిత్రకారుడు కైపీ చిత్రానికి తుది మెరుగులు దిద్ది ఆయనకు ఒకసారి చూపి అక్కడ నుంచి బయలుదేరాడు. నేను అనుసరించాను. మా యిద్దరి వెనుకా 'బోజోకి వచ్చింది మేం ఇద్దరం వంతెన మీదకు వచ్చేసరికి "బాబూ!" అని పిలిచిన పిలుపు విన్పించింది.

మేం ఇద్దరం తక్కున ఆగి వెనక్కు తిరిగాం. ఆమె వేగిరం మా దగ్గరకు వచ్చి చిత్రకారుడిని అభ్యర్థిస్తూ యిలా అంది.

"మా అమ్మాయి ఇలోకా బొమ్మ వేయవూ?"

"ఎక్కడుంది ఆ పాప?" చిత్రకారుడు అడిగాడు.

"ఇప్పుడది లేదు. ఇప్పుడది లేదు" ఆమె కళ్లలో నీళ్లు నిండాయి.

"ఒక్కతే కూతురు. అందమైన పిల్ల, నీలికళ్లు. పాపం చనిపోయింది." నేను చెప్పాను.

"అవును" ఆమె తలవూపింది.

"అయితే బొమ్మ వేయడం కష్టం. ఆ పిల్ల ఫోటో ఉందా?" చిత్రకారుడు అడిగాడు.

"లేదు. అందుకేగా చిత్రం అడుగుతున్నాను"— ఆ తల్లి శూన్యంగా చూస్తూ అంది.

మేం నడుస్తున్నాం. ఆమె అనుసరించి వస్తోంది.

"ఆ పిల్లలాంటి పిల్ల ఈ గ్రామంలోనే ఉండేది కాదు. అంత అందంగా ఉండేది. అందమైన జుట్టు. నీలితారల వంటి కళ్లు. నాలుగు నెలల క్రితం చనిపోయింది" —నేను చిత్రకారుడికి చెప్పాను.

అతను గంభీరంగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఆమె మౌనంగా అనుసరిస్తోంది. ముగ్గురం నదీ తీరంపై నిలిచాం. సూర్యాస్తమయం అవుతున్నది ఆ నిర్జన ప్రదేశంలో అతడు ఆగాడు.

"ఆ పిల్ల వాళ్లమ్మలా ఉంటుందా?" అని చిత్రకారుడు నన్ను ప్రశ్నించాడు.

"పెద్దయ్యాక అలా ఉండేది" అన్నాన్నేను.

"అయితే ప్రయత్నిస్తాను. ఈవిడనే మోడల్‌గా పెట్టుకొని ఏడేళ్ల వయసులో ఆమె ఎలా ఉండేదో అలా వేస్తాను"— చిత్రకారుడు ఉత్సాహంగా అన్నాడు.

"సాధ్యపడుతుందా?" అన్నాన్నేను.

"ఆ! ఆవిడ జుట్టు రంగు యిప్పటికన్నా వేరుగా ఉంటుంది. కళ్లు యిప్పటికన్నా పెద్దవిగా, కాంతిగా ఉంటాయి. చెక్కిళ్లు, మదురు కొంచెం సవరించి చిత్రీకరిస్తాను. మొత్తం ముఖాన్ని యిప్పటికన్నా వాడిగ్గా లేతగా, గుండ్రంగా, పుష్టిగా ఉండేటట్లు

గీస్తాను. అంతే!'' చిత్రకారుడు అన్నాడు.

''గుడ్! ఆ పిల్ల పుష్టిగా, నాజూగ్గా పాలపిట్టలా ఉండేది''— అన్నాన్నేను.

''మేస్టారూ! ఆ పిల్ల ముఖం గుండ్రంగా ఉండి ఉంటుందని, ఆమె ఎముకలు మాంసలమై ఉండి ఉంటాయని, గీరవర్ణంలో ఆమె కంఠం సన్నగా శంఖంవలె ఉండి ఉంటుందని ఈవిణ్ణి చూసి నేను వూహించాను. బొమ్మ వేశాక మీరే ఆ మాట అంటారు'' — చిత్రకారుడు భరోసా యిస్తూ అన్నాడు.

ఆ వెర్రితల్లి మా మాటల్ని వింటూనే ఉందని మాకు తెలుసు. ఆమెలో వింత ఆనందం, చెప్పలేని తృప్తి ఆ క్షణంలో కనిపించాయి.

* * *

ఆ మర్నాడు ఆ చిత్రకారుడు మరణించిన ఆ పాప బొమ్మని వేయడం ప్రారంభించాడు.

ఆ పిచ్చితల్లి అతడి ఎదురుగా కూర్చుని ఉంది. అలా ఎందుకు కూర్చోవాలో తెలియకుండానే ఆమె నిశ్చలంగా కూర్చున్నట్లు ఆమె చూపులే చెప్పక చెప్పాయి. కూతుర్ని బొమ్మలో చూసుకోవాలన్నదే ఆ పేదతల్లి పేరాశ.

చిత్రకారుడు ఆ పాప చిత్రాన్ని చిత్రించాక ఆ పటానికి ఒక కాగితాన్ని చుట్టి బోజోకిని పిలిచాడు. ఆమె ఆ చిత్రాన్ని తేరిపార ఆబగా చూసింది. కాని చనిపోయిన కూతురు గుర్తుకు వచ్చినట్లు ఏడ్వసాగింది.

''మీ అమ్మాయే! గుర్తు పట్టారా?'' అని నేను ప్రశ్నించాను.

''ఎంత మారిపోయింది. పరలోకంలోకి వెళ్లి పిచ్చిపిల్ల ఎలా అయిపోయిందీ!'' ఆ తల్లి పిచ్చిగా అని కళ్లనీళ్లు తుడుచుకుంది.

అంటే ఆ బొమ్మలో లోపం ఏదో ఉందన్నమాట! ఎవరు చెప్పగలరు?

★



## పెళ్లి

''మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు!'' సినిమా నటిని అడిగాడు విలేకరి.

''సినిమాల్లో తల్లి అయినప్పుడు'' చెప్పిందా హీరోయిన్.

బి.మల్లికార్జునరావు
(పెద్దాపురం)